


sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 18-11-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 197 EDITOR: ROHINI



జేఎన్‌టీయూలో అవినీతీశ్వరుడు

యూనివర్సిటీని అడ్డగోలుగా దోచిన మాజీ అధికారి



- సీబీఐ ఆదేశంతో ఐదుగురు సభ్యులతో కమిటీ!
- కళ్లు చెదిరే కోట్ల అక్రమాస్తులతో హైదరాబాదులో లగ్జరీ లైఫ్
- గేటెడ్ కమ్యూనిటీలో 15 కోట్ల విలువైన మూడు ప్లాట్లు
- పది ఎకరాల విస్తీర్ణంలో 30 కోట్ల విలువైన ఫామ్‌హౌస్
- సొంత జిల్లాలో కోట్ల విలువైన 30 ఎకరాల భూమి
- వివిధ వ్యాపారాల్లో దాదాపు పది కోట్ల పెట్టుబడులు
- జేఎన్‌టీయూలో రూ. 52 కోట్ల గల్లంతు సూత్రధారి అతడే
- కేంద్ర పరిశోధన సంస్థల కోట్ల నిధుల గోల్మాల్ పాత్రధారి

హైదరాబాద్ జేఎన్‌టీయూలో గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన ఓ మాజీ అధికారి బండారం ఇప్పుడు బట్టబయలవుతోంది. యూనివర్సిటీని ఆయన అక్రమాస్తులు కూడబెట్టే ఏటీఎంలా మార్చేశారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ సీబీఐకి అందిన ఫిర్యాదు ఇప్పుడు వర్సిటీ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. అసలు ఆ మాజీ అధికారి ఎవరు? ఆయన హయాంలో తెరవెనుక ఏం జరిగింది? ప్రభుత్వ నిధులను ఎలా స్వాహా చేశారు? అనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు చూద్దాం.

- సహనం వందే, హైదరాబాద్

కళ్లు చెదిరే ఆస్తులు...

హైటెక్ సిటీకి కొద్ది దూరంలో అత్యంత ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీలో మూడు ప్లాట్లు. ఒక్కో ప్లాట్ విలువ ఐదు కోట్లు. మూడింటి విలువ కలిపి పదిహేను కోట్లు. నగర శివారులో దాదాపు పది ఎకరాల విస్తీర్ణంలో ఫామ్‌హౌస్. దాని విలువ సుమారు ముప్పై కోట్లు. హైదరాబాద్‌లో మరో ఆరు చోట్ల ఖరీదైన ప్లాట్లు. ఒక్కోటి మూడు వందల గజాలు. ఒక్కో ప్లాట్ విలువ రెండు నుంచి మూడు కోట్లు. ఇక వ్యాపారాల్లో పెట్టుబడులు దాదాపు పది కోట్లు. సొంత జిల్లాలో మరో 30 ఎకరాల భూమి. ఈ ఆస్తుల వివరాలు వింటే ఏమనిపిస్తుంది? ఆయన ఒక బడా వ్యాపారవేత్త అనుకుంటారు కదా. కానీ ఆయన హైదరాబాద్ జేఎన్‌టీయూ ప్రొఫెసర్. ఆ యూనివర్సిటీకి మాజీ అధికారి. ఒక ప్రొఫెసర్ జీవితాంతం కష్టపడినా ఈ స్థాయిలో ఇన్ని కోట్ల రూపాయల విలువైన ఆస్తులు సంపాదించగలరా? కానీ ఇక్కడ పేర్కొన్న ఆస్తులు ఆయనవేనంటే నమ్మగలరా?



గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలు దోపిడీ...

గత ప్రభుత్వ హయాంలో నియమితుడైన జేఎన్‌టీయూ టాప్ ఫైవ్ అధికారుల్లో ఆయన ఒకరు. ఇంకా చాలా సర్వీసు ఉండగానే ఇన్ని కోట్ల విలువైన ఆస్తులు ఎలా సమకూరాయి? ఆయన ఆదాయ వనరులేమిటి? పదవిలోకి రాకముందు ఉన్న ఆస్తులెన్ని? ఆ తర్వాత కొనుగోలు చేసినవెన్ని? ఇవే ఇప్పుడు ప్రధాన ప్రశ్నలు. ఇంతకీ ఈ వ్యవహారం వెలుగులోకి ఎలా వచ్చింది? జేఎన్‌టీయూలో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కే.పీ. భాగ్య వెంకట కుమార్ అనే వ్యక్తి నేరుగా కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సీబీఐ... జేఎన్‌టీయూ చీఫ్ విజిలెన్స్ అధికారికి, రిజిస్ట్రార్‌కు లేఖ రాసింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, సమగ్ర విచారణ అనంతరం నివేదిక అందించాలని కోరినట్లు సమాచారం.

ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ?

సీబీఐ నుంచి వచ్చిన ఆదేశాలతో జేఎన్‌టీయూ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేందుకు ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఈ కమిటీలో అదే యూనివర్సిటీకి చెందిన అధికారులను నియమిస్తే పారదర్శకతపై సందేహాలు తలెత్తవచ్చని యంత్రాంగం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే యూనివర్సిటీకి సంబంధం లేని బయటి ప్రముఖులు, నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఆర్థిక వ్యవహారాలు, పరిపాలన, పరిశోధన ప్రాజెక్టులు, పదోన్నతులు, టెండర్లకు సంబంధించిన అంశాలను ఈ కమిటీ పరిశీలించాల్సి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ అధికారి పాత్రతోపాటు, ఆయనకు సహకరించినట్లు ఆరోపణలు ఉన్న ఇతరుల వ్యవహారాలనూ పరిశీలించాల్సి ఉంటుంది. కమిటీ సమర్పించే నివేదికను తిరిగి సీబీఐకి పంపించనున్నారు. ఈ విచారణలో ఎలాంటి ఆధారాలు బయటపడతాయి? ఎవరి పాత్ర ఎంతవరకు ఉందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఆడిట్‌లో అనేక అభ్యంతరాలు...

గత ప్రభుత్వ హయాంలో, అంటే 2023-24 వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలపై నిర్వహించిన ఆడిట్‌లో అనేక అభ్యంతరాలు నమోదయ్యాయి. సరైన ఆధారాలు, బిల్లులు, వోచర్లు లేకుండా ఖర్చు చేసినట్లు గుర్తించిన మొత్తం అక్షరాలా 52 కోట్లు. ఇక మరో తీవ్రమైన ఆరోపణ పరిశోధన ప్రాజెక్టుల నిధుల వినియోగానికి సంబంధించింది. పరిశోధన పరికరాలు కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో చూపించి, వాస్తవంగా వాటిని కొనుగోలు చేయలేదన్నది ప్రధాన ఆరోపణ. కొంతమందికి ప్రొఫెసర్ హోదాలు కల్పించడంలో నిబంధనలు పాటించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే యూనివర్సిటీలో భారీ నిర్మాణ పనులు, వివిధ కాంట్రాక్టుల కేటాయింపుల్లోనూ గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు, ఆ మాజీ అధికారి కార్యాలయ సుందరీకరణ, పునరుద్ధరణ పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

సహకరించినవారెవరు?

ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన కోణం ఆ మాజీ అధికారికి సహకరించిన వ్యక్తుల పాత్ర. ఒక కీలక అధికారి ఒక్కడే ఇన్ని వ్యవహారాలను నిర్వహించడం సాధ్యమేనా? టెండర్ల ప్రక్రియలో సహకరించినవారెవరు? అక్రమాలు బయటపడకుండా అడ్డుకున్నవారు ఎవరు? మాజీ అధికారికి కొంతమంది అధికారులు అండగా నిలిచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, అక్రమాలు బయటకు రాకుండా చూసేందుకు కొంతమందికి ఖరీదైన ప్లాట్లు, కార్లు బహుమతులుగా ఇచ్చారన్న సంచలన ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రత్యేక కమిటీ విచారణలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై ఆధారాలు లభిస్తే తదుపరి దర్యాప్తు మరింత కీలకంగా మారుతుంది. అవసరాన్ని బట్టి సీబీఐతో పాటు ఆదాయపు పన్ను శాఖ, అవినీతి నిరోధక శాఖ వంటి సంస్థలు కూడా రంగంలోకి వచ్చే అవకాశం ఉంది.



ఎలక్ట్రిక్ కార్లకు బ్రేకులు

కొనడానికి ప్రజల వెనుకంజ

- కొనుగోలు ధరే ప్రధాన అడ్డంకి
- ఛార్జింగ్ కేంద్రాల కొరత
- చైనా దూకుడు.. ప్రపంచానికి పోటీ

ఒకప్పుడు కారు కొనాలంటే మైలేజీ ఎంత వస్తుంది? పెట్రోల్ ఖర్చు ఎంత? అని ఆలోచించేవాళ్లం. ఇప్పుడు మరో ప్రశ్న వచ్చి చేరింది. ఎలక్ట్రిక్ కారు కొనాలా? లేక పెట్రోల్ కారే మంచిదా? ఎలక్ట్రిక్ కార్లకు శబ్దం తక్కువ. పొగ కాలుష్యం తక్కువ. నిర్వహణ ఖర్చులు కూడా తక్కువగా ఉండే అవకాశం ఉంది. అయినా ప్రపంచవ్యాప్తంగా వీటి వినియోగం అనుకున్నంత వేగంగా పెరగడం లేదు. అసలు సమస్య ఎక్కడుంది? సాంకేతికతలోనా? ధరలోనా? ఛార్జింగ్ సదుపాయాల్లోనా? లేక వినియోగదారుల ఆలోచనా విధానంలోనా? - సహనం వందే, హైదరాబాద్



ఎలక్ట్రిక్ కార్లు పర్యావరణానికి మేలు చేయడంతోపాటు నిర్వహణ ఖర్చులను తగ్గించే ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. అయినా వీటి వినియోగం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ప్రపంచ ఆర్థిక వేదిక గణాంకాల ప్రకారం, 2025లో ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన కొత్త కార్లలో నాలుగింట ఒక వంతు విద్యుత్, హైబ్రిడ్ వాహనాలే. అయితే రోడ్లపై తిరుగుతున్న మొత్తం కార్లలో వీటి వాటా కేవలం ఐదు శాతమే. పాత కార్ల స్థానంలో కొత్తవి రావడానికి సమయం పడుతుండటంతో రవాణా వ్యవస్థలో మార్పునకు దాదాపు రెండు దశాబ్దాలు పట్టవచ్చని నిపుణుల అంచనా.

ధర.. కొనుగోలుదారులకు భారమే!

ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలులో ప్రధాన అడ్డంకి ధర. పెట్రోల్ కార్లతో పోలిస్తే వీటి ప్రారంభ ధర ఎక్కువగా ఉండటం వినియోగదారులను వెనక్కి లాగుతోంది. అయితే ఇంట్లో ఛార్జింగ్ చేసుకునే అవకాశం ఉంటే ప్రయాణ ఖర్చు, నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి. మరోవైపు ఛార్జింగ్ కేంద్రాల కొరత కూడా సమస్యగా మారింది. ముఖ్యంగా సుదూర ప్రయాణాల్లో కేంద్రాలు అందుబాటులో ఉంటాయా? ఎంతసేపు వేచి చూడాలి? అనే సందేహాలు వినియోగదారులను వెంటాడుతున్నాయి. అపార్ట్‌మెంట్లలో ప్రత్యేక ఛార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం కూడా సవాలుగా మారుతోంది.

బ్యాటరీ సాంకేతికతలో కొత్త మార్పులు!

ఎలక్ట్రిక్ కార్ల భవిష్యత్తును నిర్ణయించేది బ్యాటరీ సాంకేతికతే. తక్కువ సమయంలో ఎక్కువ ఛార్జింగ్, ఎక్కువ ప్రయాణ దూరం అందించే బ్యాటరీల అభివృద్ధిపై పరిశోధనలు సాగుతున్నాయి. హార్వర్డ్ విశ్వవిద్యాలయ నిపుణురాలు ఎలైన్ బక్‌బర్గ్ వివరాల ప్రకారం, చైనాలోని కొన్ని అత్యాధునిక వాహనాల్లో పది నుంచి తొంభై ఐదు శాతానికి పైగా ఛార్జింగ్‌ను ఐదు నుంచి పది నిమిషాల్లో పూర్తిచేసే సాంకేతికత అందుబాటులోకి వస్తోంది.

చైనా.. నార్వే ప్రత్యేక నమూనాలు!

విద్యుత్ కార్ల వినియోగంలో చైనా దూసుకెళ్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, తక్కువ ధరల మోడళ్లు, బ్యాటరీ తయారీలో పెట్టుబడులు అక్కడి మార్కెట్‌ను విస్తరిస్తున్నాయి. కొత్త కార్ల అమ్మకాల్లో విద్యుత్, హైబ్రిడ్ వాహనాల వాటా దాదాపు సగానికి చేరిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు నార్వేలో కొత్త కార్ల అమ్మకాల్లో పూర్తిగా బ్యాటరీతో నడిచే వాహనాల వాటా తొంభై ఐదు శాతాన్ని మించింది. ఛార్జింగ్ సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ప్రజల్లో పెరిగిన నమ్మకం ఇందుకు కారణాలు. ఈ దేశాల అనుభవాలు ఇతర ప్రభుత్వాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

అవినీతి ఉద్యోగులతో జైళ్లు కిటకిట!

కటకటాల్లో 60 మంది.. ఉన్నతాధికారులూ అదే దారి!

ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ సంపాదనకు తెరలేపుతుండటంతో తెలంగాణ జైళ్లు నిండిపోతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 60 మంది ఉద్యోగులు రిమాండ్‌లో ఉండగా, అందులో చంచల్‌గూడ జైలులోనే 35 మంది ఉన్నారు. కింది స్థాయి సిబ్బందే కాకుండా కీలక ఉన్నతాధికారులు కూడా కటకటాలపాలవడం ప్రభుత్వ యంత్రాంగంలో కలకలం రేపుతోంది. ఒకవైపు ఏసీబీ వరుస అరెస్టులు చేస్తుంటే, మరోవైపు గతంలో నమోదైన కేసులే మూసివేత దిశగా వెళ్లడం కొత్త చర్చకు దారితీస్తోంది.

- సహనం వందే, హైదరాబాద్

- ఒక్క చంచల్‌గూడ జైలులోనే 35 మంది అధికారులు
- అన్ని శాఖల్లో అవినీతి జాడలు... కోట్లలో అవినీతి
- 23 కేసులు మూసివేత... అనుమతులతోనే చిక్కులు



పోలీసు, నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్, రోడ్లు-భవనాల శాఖల అధికారులు ఈ వలలో చిక్కుకున్నారు. నాగర్‌కర్నూల్ నీటిపారుదల డిప్యూటీ ఈఈ ఆర్. సత్యనారాయణ, ఇంజినీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బి. రవీందర్ అరెస్టయిన వారిలో ఉన్నారు. నిమ్స్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్, టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి అరెస్టు కావడం అధికార వర్గాల్లో సంచలనం సృష్టించింది.

రూ.8 వేల నుంచి రూ.150 కోట్ల అక్రమాస్తుల దాకా

లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్న వారితో పాటు భారీగా ఆస్తులు కూడబెట్టిన అధికారులు దర్యాప్తు సంస్థలకు చిక్కుతున్నారు. జూలైలో అరెస్టయిన డీఎస్పీ ఎన్. భీమ్‌రెడ్డి కేసులో సుమారు రూ.150 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించగా, సత్యనారాయణ వద్ద రూ.7 కోట్ల ఆస్తులు వెలుగు చూశాయి. చిన్నపాటి లంచం నుంచి వందల కోట్ల ఆస్తుల దాకా అవినీతి వేళ్లూనుకోవడం ఆందోళనకరం.

అనుమతుల నిరాకరణతో మూతపడుతున్న కేసులు

గత మూడేళ్లలో వివిధ శాఖలకు చెందిన 20 మందికి పైగా అధికారులపై నమోదైన 23 కేసులు మూసివేతకు చేరాయి. దర్యాప్తు పూర్తయినా న్యాయస్థానంలో విచారణకు ప్రభుత్వ అనుమతి లభించకపోవడమే కారణం. 2023లో రూ.8 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్సై కేసులో రసాయన పరీక్షలోనూ నెగ్గినా, తగిన ఆధారాలు లేవంటూ ప్రభుత్వం విచారణకు అనుమతి నిరాకరించింది. చివరకు ప్రత్యేక న్యాయస్థానం ఆ కేసును మూసివేసింది.

అరెస్టులతో పాటు కఠిన శిక్షలు పడితేనే ప్రక్షాళన

2025 నుంచి ఉన్నతాధికారుల అక్రమాస్తులపైనా నిఘా పెరిగింది. అయితే 60 మంది జైళ్లలో ఉండటం ఒక కోణమైతే, కేసులు మూతపడటం వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. అవినీతిని సమూలంగా అరికట్టాలంటే అరెస్టులతో పాటు దర్యాప్తు, ప్రభుత్వ అనుమతులు, న్యాయవిచారణ పారదర్శకంగా సాగి తప్పు చేసిన ఎంతటి వారికైనా కఠిన శిక్షలు పడినప్పుడే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది.